పూటకోమాట రేవంత్‌కు అలవాటు

- నీటిపారుదలశాఖలో నియామకపత్రాల జాప్యం శోచనీయం
- ఉద్యోగాలు సాధించిన సర్కారు సంబురం లేకుండా చేస్తున్నది
- వెంటనే పత్రాలివ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): పూటకోమాట చెప్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. పెళ్లికి వెళ్లడం కోసం 10వ తరగతి పరీక్షల ఫలితాల విడుదలలో ఆలస్యం చేయడం, నియామకపత్రాలు ఇవ్వకుండా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఇబ్బందులు పెట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో నీటిపారుదలశాఖలో ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి దారుణమని విమర్శించారు. ప్రచార ఆర్భాటం పక్కనపెట్టి, ఎంపికైన అభ్యర్థులకు వెంటనే ఉద్యోగ నియామకపత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు సంబురం లేకుండా చేస్తున్నదని ధ్వజమెత్తారు. నియామకపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని 5 సార్లు వాయిదా వేయడం, అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవడం శోచనీయమని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆ నలుగురి వేలకోట్ల దోపిడీ!

- రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి, కృష్ణారెడ్డి, ఫయీమ్ అక్రమాలు
- టెండర్లు లేకుండా ప్రైవేట్ యాడ్ ఏజెన్సీలకే అవకాశం
- అప్పు పుడుతలేదన్న రేవంత్ వ్యాఖ్యలు సిగ్గుచేటు
- కాంగ్రెస్ మాజీ నాయకుడు బక్కా జడ్సన్ ఆరోపణలు

ఖైరతాబాద్, మే 8: సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కృష్ణారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం అనుచరుడు ఫయీమ్ ఖురేషీ కలిసి ఖజానాకు వేల కోట్ల రూపాయలు గండి కొడుతున్నారని కాంగ్రెస్ మాజీ నాయకుడు బక్కా జడ్సన్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో జడ్సన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కమీషన్లు ఇచ్చే యాడ్ ఏజెన్సీలకే టెండర్లు లేకుండానే హోర్డింగ్‌ల బాధ్యతలు కట్టబెడుతున్నారని చెప్పారు. శంషాబాద్‌లో ఏడాదికి రూ.12కోట్లు ప్రభుత్వానికి కట్టాల్సి ఉండగా, కేవలం రూ.63 లక్షలు కట్టిన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఇలా రాష్ట్రం మొత్తం కలిపి వేలకోట్ల దోపిడీ జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రం దివాలా తీసిందన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని మండిపడ్డారు. తెలంగాణకు పెట్టుబడులు రాకుండా, ఏపీకి తరలిపోయేలా రేవంత్ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

14 నుంచి డిగ్రీ పరీక్షల బహిష్కరణ!

- ప్రభుత్వానికి టీపీడీఎంఏ అల్టిమేటం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుంటే ఈనెల 14నుంచి నిర్వహించే డిగ్రీ పరీక్షలను బహిష్కరిస్తామని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎంఏ) ప్రభుత్వానికి హెచ్చరికలు జారీచేసింది. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో అనేక ప్రైవేటు కాలేజీలు అచేతనస్థితిలో ఉన్నాయని.. 50శాతానికిపైగా డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయని ఆ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి వాపోయారు. రెండు, మూడురోజుల్లో ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలు జమ చేస్తేనే యూనివర్సిటీ షెడ్యూల్ ప్రకారం పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు. లేకపోతే ఉద్యోగులు సహకరించక యాజమాన్యాలు చేతులెత్తేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

దివాలా పాలనలో దుబారా ఖర్చు!

- నిధులను నీళ్లలా వ్యయం చేస్తున్న నీటిపారుదలశాఖ
- ఉద్యోగ నియామకపత్రాల జారీ కోసం అర్భాటాలు
- రోజుకు రూ.లక్ష కిరాయితో టెంట్లు, కుర్చీలు ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డికి వీలుకావడం లేదంటూ వాయిదాలు
- ప్రభుత్వంపై ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు ఆగ్రహం
- 10 నిమిషాల పనికి 10 రోజులుగా నిరీక్షణేంటని నిలదీత

హైదరాబాద్ జలసౌధలో నియామకపత్రాల కోసం బుధవారం రోజంతా నిలీక్షించిన ఏఈ, జేటీవో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మొత్తం పతనమైందని, అప్పు పుట్టడంలేదని, ఎవరూ నమ్మడంలేదనీ వేదిక ఏదైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే ప్రసంగం చేస్తున్నారు. ఆ మధ్య సచివాలయ ఉన్నతాధికారులు కూడా పొదుపు సూత్రాలు, వాటి ప్రాధాన్యతపై మంచి మంచి సుభాషితాల ప్రకటనలు చేశారు. ఉద్యోగులు ఆఫీస్‌లలో లైట్లు, ఫ్యాన్ల విషయంలో పొదుపు పాటించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఆదేశాలు కూడా ఇచ్చారు. కానీ ఇవన్నీ ప్రచారం కోసమేనని, వాస్తవంగా సర్కారు పనితీరు భిన్నంగా ఉందని ఉద్యోగుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటిపారుదలశాఖలో జరుగుతున్న ఓ వింత తతంగమే ఇందుకు నిదర్శనమని ఉద్యోగులు మండిపడుతున్నారు.

ముహూర్తం లేని ఫంక్షన్‌కు ఏర్పాట్లు!

గతంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి సంబంధితశాఖ అధికారులు నియామకపత్రాలు అందజేసేవారు. అరుదుగా సంబంధితశాఖ మంత్రి ఆధ్వర్యంలో పత్రాలు ఇచ్చేవారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు పనిలో చేరిపోయేవారు. కానీ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా, ఏ నియామకపత్రమైనా సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగానే ఇవ్వాల్సిందేనని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలో నీటిపారుదలశాఖలో ఉద్యోగాలు సాధించిన వారికి నియామకపత్రాలు అట్టహాసంగా ఇవ్వాలని నిర్ణయించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వీలుకాలేదనే కారణాలతో ఐదుసార్లు వాయిదా వేశారు.

సర్కారు వ్యయం... అభ్యర్థుల ప్రయాస

నియామకపత్రాలను అందివ్వకుండా అభ్యర్థులను ముప్పుతిప్పలు పెడుతున్న కాంగ్రెస్ సర్కారు, మరోవైపు లక్షల్లో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఈ, జేటీవో అభ్యర్థులకు నియామకపత్రాల అందజేత కోసం ఏప్రిల్ 28న జలసౌధలో టెంట్, కుర్చీలు ఏర్పాట్లు చేశారు. వీటికి రోజుకు దాదాపు రూ.లక్ష ఖర్చవుతుందని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వ పెద్దలు కార్యక్రమం వాయిదా వేస్తూ ప్రజాధనం వృథా చేయడం విడ్డూరమని ఇరిగేషన్‌శాఖ అధికారులు కూడా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే 10 రోజులు గడవగా రూ.10లక్షల ఖర్చు మీదపడినట్టు తెలిపారు.

వాయిదా పడితే కనీసం చెప్పరా?

ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఏప్రిల్ 14న నియామకపత్రాలను అందజేసేందుకు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రణాళిక సిద్ధంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయాలని నిర్ణయించారు. కానీ ఆ తర్వాత కార్యక్రమాన్ని 28వ తేదీకి వాయిదా వేశారు. మళ్లీ మే 2వ తేదీకి, 5వ తేదీకి అంటూ దాటవేస్తూ వచ్చారు. మే 7న జలసౌధలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాల అందజేత తప్పనిసరిగా ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులందరూ బుధవారం ఉదయమే జలసౌధకు తరలివచ్చారు. సాయంత్రం వరకు పడిగాపులుకాశారు. చివరికి ఇరిగేషన్‌శాఖ అధికారులను సంప్రదించగా కార్యక్రమం వాయిదాపడిందని చెప్పడంతో అభ్యర్థులు తీవ్రఅసహనం వ్యక్తంచేశారు. ఇప్పటికే కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ వస్తున్నారని, పిలిచిన తర్వాత కార్యక్రమం వాయిదా పడితే కనీసం సమాచారం కూడా ఇవ్వరా అని మండిపడ్డారు.

ఉద్యోగం వచ్చినా దక్కని ఆనందం

నీటిపారుదలశాఖలో సివిల్, ఎల్అండ్టీ కల్, మెకానికల్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), జూనియర్ టెక్నికల్ ఆఫీసర్‌కు సంబంధించి 833 పోస్టుల భర్తీకి 2022లో బీఆర్ఎస్ హయాంలోనే నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో నీటిపారుదలశాఖకు సంబంధించి(ఏఈలు సివిల్-142, మెకానికల్-35, ఎల్అండ్టీకల్-50, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు-212) 439పోస్టులు ఉన్నాయి. పోస్టుల భర్తీకి నిరుడు అక్టోబర్‌లో రాతపరీక్ష నిర్వహించారు. ఈ ఫిబ్రవరిలో ఫలితాలను వెల్లడించారు. ఇరిగేషన్‌శాఖలోని ఏఈ, జేటీవో పోస్టులకు 437 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. మార్చి 5న, 6న 400 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేశారు. వారికి నియామక పత్రాలను అందజేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు నియామకపత్రాలను ఇవ్వకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రేపూమాపు అంటూ కాలయాపన చేస్తున్నది.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన

- మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి : వాతావరణశాఖ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొన్నిరోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడి భగభగలు ఉంటుండగా, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రానున్న మూడ్రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీలు తక్కువ నమోదయ్యే అవకాశమున్నదని పేర్కొన్నది. శుక్రవారం పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

సీడ్ కార్పొరేషన్‌లో జీతాలకు కటకట!

- బకాయిలు అడిగితే అప్పు ఇప్పించిన సర్కారు
- అప్పుపై వడ్డీకే ఆదాయం సరిపోతున్నవైనం
- వేతనాలు ఇవ్వడం గగనంగా మారిన దుస్థితి
- సంస్థను కాపాడాలని ఉద్యోగ సంఘాల డిమాండ్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకున్నది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడానికీ కార్పొరేషన్ మల్లగుల్లాలు పడుతున్నది. ప్రభుత్వం నుంచి రూ.400 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్నదని అధికారులు చెప్తున్నారు. బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరితే గ్యారెంటీతో బ్యాంకు రుణం ఇప్పించిందని తెలిపారు. ఆ అప్పుపై నెలకు రూ.3 కోట్లకు పైగా వడ్డీ చెల్లించాల్సి వస్తున్నదని తెలిపారు. కార్పొరేషన్ ఆర్థిక పతనంతో టెండర్లు వేయడానికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని ఉద్యోగులు చెప్తున్నారు. కార్పొరేషన్‌లో జీతాలు నెలాఖరులోనో, మరో నెలలోనో అందుతున్నాయని తెలిపారు. సంస్థ మనుగడ సాగించాలంటే బ్యాంకు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించి, ఇన్నాళ్లు వడ్డీ కింద బ్యాంకుకు కార్పొరేషన్ చెల్లించిన మొత్తాన్ని ప్రభుత్వం ఇవ్వాలని, ప్రభుత్వ ఖాతా నుంచి ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ పోస్టులు నింపండి: టీఐజీఎల్ఏ

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): జూనియర్ కళాశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీఐజీఎల్ఏ) డిమాండ్ చేసింది. ఖాళీగా ఉన్న 64 ప్రిన్సిపాల్ పోస్టులను పదోన్నతుల ద్వారా నింపాలని కోరింది. 26 డీఐ ఈవో పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీఐజీఎల్ఏ నేతలు జంగయ్య, నయీమ్ గురువారం ఇంటర్మీడియట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

గన్నీ బ్యాగులివ్వరు.. లారీలు రావు

గన్నీ బ్యాగులివ్వరు.. ధాన్యం ఎత్తేందుకు లారీలు రావు.. అకాల వర్షాలతో నిండా మునుగుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు సింగిల్ విండో పరిధిలో రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని, తూకం చేసినా లారీలు రావడం లేదని గురువారం విండో కార్యాలయం ఎదుట అన్నదాతలు ఆందోళన చేపట్టారు. వడగండ్ల వర్షానికి ధాన్యం తడిసిందని, మళ్లీ ఆరబెట్టినా ఇప్పటికీ కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రావడం లేదని చింతకుంటకు చెందిన రైతు వెంకటేశ్ ఆరోపించాడు. -మరికల్

జీవో 1274ను మినహాయించాలి

- ఎస్సీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఎట్‌గ్రీవ విజ్ఞప్తి

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): 50 ఏండ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులను బాలికల గురుకులాల్లో కొనసాగించాలని, వారిని జీవో 1274 నుంచి మినహాయించాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎట్‌గ్రీవ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్, గురుకుల సెక్రటరీ వర్షిణిని గురువారం కలిసిన సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎట్‌గ్రీవ రాష్ట్ర అధ్యక్షుడు కూకట్ల యాదయ్య మాట్లాడుతూ.. 2016లోనే జీవో 1274 వచ్చిందని, అదీ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది మాత్రమేనని వెల్లడించారు. అదీగాక 2018, 2019లోనూ, నిరుడు నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్లలో కూడా ఎక్కడా జీవోను అమలు చేయలేదని గుర్తుచేశారు. బదిలీల క్రమంలో బాలుర గురుకులాలను ఎంచుకునే అవకాశాన్ని బాలికల గురుకులాల్లో పనిచేసే పురుష సిబ్బందికి కల్పించాలని అన్నారు. లేదంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి, కోశాధికారి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

9మంది డీఎస్పీల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 9మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా పనిచేస్తున్న కాజీపేట్ ఏసీపీగా, సిద్దిపేట సీసీఆర్బీలో ఏసీపీగా ఉన్న సీహెచ్ శంకర్‌రెడ్డిని మేడ్చల్ ఏసీపీగా, మేడ్చల్ ఏసీపీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేశారు. రాచకొండ ఎస్‌వోటీ ఏసీపీ వీ శ్రీకాంత్ గౌడ్‌ను శంషాబాద్ ఏసీపీగా, ఖమ్మం సీసీఆర్బీలో ఏసీపీ పున్నం రవీందర్‌రెడ్డిని నర్సంపేట్ ఏసీపీగా, నర్సంపేట్ ఏసీపీగా చేస్తున్న వీ కిరణ్‌కుమార్‌ను డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేశారు. అలాగే హైదరాబాద్ సీపీఎస్‌లో ఏసీపీ వై హరికుమార్‌ను కాచిగూడ ఏసీపీగా, టీజీపీఏ డీఎస్పీ ఎస్ సారంగపాణిని వైరా ఏసీపీగా, వైరా ఏసీపీగా ఉన్న ఎం ఏ రెహ్మాన్‌ను డీజీపీ ఆఫీస్‌కు బదిలీ చేశారు.

'పాలమూరు' ప్రాజెక్టుపై పీటముడి!

- ఏపీ సమ్మతిస్తేనే అనుమతులు మంజూరు
- తాజాగా తెలంగాణకు తేల్చిచెప్పిన సీడబ్ల్యూసీ
- ఇప్పటికే పార్లమెంట్‌లో కేంద్ర జల్‌శక్తిశాఖ వెల్లడి
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ప్రాజెక్టుపై మెలిక
- మరోవైపు తొలి నుంచీ ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాలు

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతుల మంజూరుపై కేంద్రం మరోసారి చేతులెత్తేసింది. ఏపీ సర్కారు సమ్మతిస్తేనే ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేస్తామని కేంద్ర జలసంఘం మరో మెలిక పెట్టింది. లేదంటే ట్రిబ్యునల్ వాదనలు ముగిసే వరకూ అనుమతుల మంజూరు కష్టమేనని తెలంగాణకు తేల్చిచెప్పింది. మరోవైపు ఏపీ సర్కారు పాలమూరు ప్రాజెక్టుపై ఆది నుంచి అనేక విధాలుగా అక్కసు వెళ్లగక్కుతున్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనులపై పీటముడి పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్ఎల్ఐఎస్) అప్పటి తెలంగాణ ప్రభుత్వం రూ.35 వేల కోట్ల అంచనా వ్యయంతో 2015లో శ్రీకారం చుట్టింది. మైనర్ ఇరిగేషన్‌లో వినియోగించుకోని 45 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను మొత్తంగా 90 టీఎంసీల నికర జలాలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేటాయించింది. డీపీఆర్‌ను సిద్ధం చేసి 2022 సెప్టెంబర్‌లో సీడబ్ల్యూసీకి గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే సమర్పించారు. ఈఏసీ నుంచి పర్యావరణ అనుమతులకు అంగీకరించింది. ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. దాదాపు ఏడాదిన్నర గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అనుమతులు మంజూరు కాలేదు.

ఏపీ నుంచి అంగీకార పత్రం తేవాల్సిందే?

ఇటీవల సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్‌జైన్‌ను కలిసి తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సారైనా అనుమతులు మంజూరు చేయాలని అతుల్‌జైన్‌ను మంత్రి కోరారు. పోలవరం డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీల జలాలను పాలమూరు ప్రాజెక్టుకు కేటాయించారని, ప్రస్తుతం ఆ జలాల అంశం ట్రిబ్యునల్ ఎదుట విచారణ కొనసాగుతున్నదని, ఆ జలాలపై ఏపీ నుంచి సమ్మతి తీసుకోవాలని, ఆ మేరకు అంగీకారపత్రం తేవాలని, అప్పుడే అనుమతుల మంజూరు సాధ్యమని రాష్ట్ర మంత్రికి తేల్చిచెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. లేదంటే ట్రిబ్యునల్ విచారణ పూర్తయ్యేవరకూ అనుమతుల మంజూరు అసాధ్యమని, డీపీఆర్ పరిశీలన కష్టమని కూడా కరాఖండిగా తేల్చేచెప్పినట్టు తెలిసింది. దీంతో తెలంగాణ ఆశలపై మరోసారి కేంద్రం నీళ్లు చల్లింది. ఇదే విషయాన్ని గతంలోనే కేంద్ర జల్‌శక్తి శాఖ అనేక సందర్భాల్లో పార్లమెంట్ వేదికగా వెల్లడించింది. మరోవైపు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఏపీ సర్కారు ముప్పేట దాడికి దిగుతున్నది. పాలమూరు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దంటూ వివిధ వేదికల్లో, కోర్టుల్లో తన గండికొట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నది. ఈ దశలోనే ఏపీ అనుమతిని సీడబ్ల్యూసీ తప్పనిసరి చేసింది.

దేవాదుల వ్యయం రూ.18,500 కోట్లకు పెంపు!

- ప్రతిపాదనలను తిప్పిపంపిన ఎస్ఎల్ఎస్‌సీ

హైదరాబాద్, మే8 (నమస్తే తెలంగాణ): దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.18,500 కోట్లకు పెంచుతూ అధికారులు చేసిన ప్రతిపాదనలను స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) తిరస్కరించింది. ప్యాకేజీల వారీగా పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం జరిగిన ఎస్ఎల్ఎస్‌సీ సమావేశంలో దేవాదుల, కాళేశ్వరం ప్యాకేజీ-16, ఎల్లంపల్లి ప్రాజెక్టుల రివైజ్డ్ అంచనా వ్యయాలపై చర్చించారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ అంచనాలను రూ.15 వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్లకు పెంచుతూ అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీనిపై కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తిరస్కరించింది. ప్యాకేజీల వారీగా పెరిగిన అంచనా వ్యయాలను ఇవ్వాలని ఎస్ఎల్ఎస్‌సీ చైర్మన్ అనిల్ సూచించారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆర్ అండ్ఆర్ ప్యాకేజీని రూ.100 కోట్లు అదనంగా చూపించగా, ప్యాకేజీల వారీగా అంచనాలు ఇవ్వాలని స్పష్టంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-16లో బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి చిట్యాల వరకు కాల్వ పనులకు సంబంధించి రూ.40 కోట్ల మేర డ్యూటీని ఎక్కువగా చూపించారని, అది ప్రాక్టికల్‌గా సరిగా లేదని, దానికి జస్టిఫికేషన్ ఇచ్చి ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు.

టన్ను ఇసుక రూ.2,000

- వేసవిలోనూ దిగిరాని ఇసుక ధర
- సర్కార్ వైఖరే కారణమని విమర్శలు
- నిర్మాణరంగ నిపుణుల ఆగ్రహం

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ఏటా చలి, వేసవికాలాల్లో రూ.1,400లోపు ఉండే టన్ను ఇసుక ధర.. ఈ ఏడాది మాత్రం రూ.2,000 వరకు పలుకుతున్నది. ఇసుక బజార్ల పేరుతో ప్రభుత్వమే ధరలు పెంచడం ఇందుకు ప్రధాన కారణమని నిర్మాణరంగ నిపుణులు చెప్తున్నారు. ఫలితంగా భారీగా అదనపు భారం పడుతున్నదని వాపోతున్నారు. చలి, వేసవికాలాల్లో టన్ను ఇసుక రూ.1,300-1,400కు పడిపోతుందని గతానుభవాలను గుర్తుచేస్తున్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు తీసుకుంటున్న విధానాలతో కాలాలకు అతీతంగా ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఇసుక అక్రమాలను అరికట్టే పేరుతో అడ్డగోలు తవ్వకాలు, రవాణా నియంత్రణ కారణంగా ఆరు నెలలుగా బహిరంగ మార్కెట్‌లో ఇసుక ధరలు భారీగా పెరిగాయని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. టన్ను ఇసుక రూ.2,300 వరకు కూడా చేరుకున్నదని వివరించారు.

ఇసుక బజార్లతో మార్కెట్ బేజార్

ఇసుక ధరలను అదుపుచేస్తామంటూ ప్రభుత్వమే టీజీఎండీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పలుచోట్ల ఇసుక బజార్లను ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే టన్ను దొడ్డు ఇసుక రూ.1,600, సన్నఇసుక రూ.1,800కు విక్రయిస్తున్నది. ఆన్‌లైన్ బుకింగ్ సంక్లిష్టంగా ఉండడంతో సామాన్యులెవరూ పెద్దగా బుకింగ్ చేసుకోవడంలేదు. లారీల యజమానులే బుకింగ్ చేసి సరఫరా చేస్తున్నారు. ఈ ఇసుక బజార్లలో మట్టితో కూడిన నాసిరకం ఇసుకను సరఫరా చేస్తున్నారని విమర్శలున్నాయి. అందుకే ఎక్కువగా బహిరంగ మార్కెట్ నుంచే కొనుగోలు చేస్తున్నామని నిర్మాణదారులు చెప్తున్నారు. ప్రభుత్వం ఇసుక బజార్లలో ధరను తగ్గిస్తే బహిరంగ మార్కెట్‌లో ధర తగ్గుతుందని వివరిస్తున్నారు.



రాజిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి మృతి

- నేడు చీర్యాలలో అంత్యక్రియలు
- మాజీ మంత్రి కేటీఆర్ సంతాపం
- నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్/కాప్రా, మే 8: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి అనారోగ్యంతో గురువారం హబ్సిగూడలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హబ్సిగూడలోని నివాసానికి చేరుకొని రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు రాజిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం చీర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజిరెడ్డి 2009 నుంచి 2014 వరకు ఉప్పల్ ఎమ్మెల్యేగా పనిచేశారు.

కేటీఆర్ సంతాపం

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సంతాపం తెలియజేశారు. ఉప్పల్ నియోజకవర్గానికి విశేష సేవలు అందించిన రాజిరెడ్డి మరణం వి